
# * కోచింగ్ సెంటర్ *

తారాబాయ్ ఇంటర్మీడియట్ ఎగ్జామ్ పాసయింది.

ఆ తరువాత తారాబాయ్‌ని ఏ కోర్సులో చేర్పించాలని ఇంట్లో అందరూ ఆలోచించారు.




"అమ్మాయిని యం.బి.బి.యస్ కోర్సు చదివిద్దామండీ!" అంది పార్వతమ్మ భర్త పరంధామయ్యతో మంచం మీద పడుకుని దగ్గుతూ.

"యం.బీ.బీ.యస్సూ సింగినాథం కాదురా అబ్బాయ్..... అమ్మాయిని డాక్టరీ చదివిద్దాం..." అంది దగ్గూ ప్లస్ ఆయాసంతో తారాబాయ్ నాయనమ్మ.

"అవును... నా కూతుర్ని డాక్టర్‌ని చేస్తా... నా తండ్రికి సమయానికి వైద్యం అందక చచ్చిపోయాడు. అలాంటి చావు ఎవరికి రాకూడదు..." అన్నాడు పరంధామయ్య ఆవేశంగా.

"మరి చెల్లి డాక్టరు అయ్యాక దాని వైద్యం సమయానికి అందడంవల్లనే పేషంట్లు చచ్చిపోతేనో?..." అన్నయ్య రఘు సందేహం వ్యక్తపరిచాడు.

"నువ్వు కట్టే బ్రిడ్జీలలా నా పేషంట్లు కూలిపోతారని అనుకుంటున్నావా?... హు..." అంది తారాబాయ్ ఇంజనీరు అన్నయ్య రఘుతో.

"ఏమ్మోవ్... ఆయన్నంటే నేనూర్కోనంతే..." అంది తారాబాయ్

వదిన సుశీల తొడకొట్టి కయ్యానికి కాలు దువ్వుతూ.
"మరి నన్నంటే నేనూర్కుంటాననుకున్నావా?..." అంది తారాబాయ్ కూడా తొడకొడ్తూ.
"మీరిద్దరూ ఇలా తొడలు వాయగొట్టుకుని నా అమృతాంజనం సీసా అడిగితే మాత్రం నేనివ్వను... ఇప్పుడే చెప్తున్నా..." అంది నాయనమ్మ.
"అబ్బబ్బ... మీరు కాస్త ఊర్కుంటారా?..." అంటూ విసుక్కున్నాడు పరంధామయ్య.
"నాన్నా... యం.బి.బి.యస్‌లో సీటు రావడం చాలా కష్టం ... ఎంట్రెన్స్ ఎగ్జామ్‌లో పాసయితే... అదీ ఎక్కువ మార్కులు వస్తేనే ఇస్తారు" అంది తారాబాయ్.
"మరేం పర్లేదే పిచ్చిపిల్లా... కోచింగ్ సెంటర్లు ఉన్నాయిగా. పరీక్ష ముందు అక్కడ కోచింగ్ తీస్కుంటే ఫస్టుగా పాసయ్యి నీకు యం.బి.బి.యస్ సీటొస్తుంది" అన్నాడు పరంధామయ్య.
"అప్పుడు నేను డాక్టరైపోయి అందరికీ ఇంజక్షన్లు చేసేస్తా... అందరికీ మెల్లగా ఇంజక్షన్ చేస్తాగానీ వదినకి మాత్రం గారిగా పొడిచేస్తా..." అంది సంబరంగా తారాబాయ్.
"అ... అ... పొడుస్తావ్ పొడుస్తావ్... వీపు చిట్లగొడ్తా" అంది సుశీల మళ్ళీ తొడకొడ్తూ.
"నువ్వు వీపు చిట్లగొడ్తే నేనూరుకుంటానా?... నేనూ వీపు చిట్లగొడ్తా..." తారాబాయ్ కూడా తొడకొట్టింది.
"నా పెళ్ళాం వీపు చిట్లగొడ్తే నేనూరుకుంటానా? ... నీ చేతులిరగ్గొడ్తా..." రఘు కూడా తొడకొట్టాడు.
"పెళ్ళాం వచ్చేసరికి చెల్లెలు చేదయిపోయింది... నా కూతుర్ని ఏమైనా అంటే నేనూరుకోనంతే..." పార్వతమ్మ ఆవేశంగా అని తొడకొట్టబోయి ఓపికలేక మానుకుని ఆయాసపడి దగ్గింది.
"మీరు ఎన్నిసార్లైనా తొడలు కొట్టుకోండి... ఆనక తొడలు వాచాయ్... అమృతాంజనం రాస్కుంటాం అని నా దగ్గర సీసా ఇమ్మంటే మాత్రం నేనివ్వను... ఇప్పుడే చెప్తున్నాను..." అంది నాయనమ్మ ముక్కుతూ.
"మీరందరూ కాస్త నోరు మూస్తారా?... లేకపోతే అందరి సంగతీ తేల్చేస్తాను..."
పరంధామయ్య కూడా తొడకొట్టాడు.
పరంధామయ్య వాళ్ళు ఉండేది ఒక టౌను. ఆ టౌనులో కోచింగ్

సెంటర్లు ఏమీలేవు. ఆ ఊరికి పక్కనున్న పట్నంలో కోచింగ్ సెంటర్లు ఉన్నాయి.

ఆ మర్నాడు పరంధామయ్య కూతురు తారాబాయ్‌ని తీస్కుని పట్నంలోని "చదువుల్ పరీక్షల్" కోచింగ్ సెంటరుకి వెళ్ళాడు.

వీళ్ళని చూస్తూనే ప్రిన్సిపాల్ బోసుబాబు "సీట్లులేవుగా... లేనేలేవుగా... హిహిహి... అసలు లేవుగా..." అన్నాడు.

పరంధామయ్య ఆశ్చర్యపోయాడు. కోచింగ్ సెంటర్లలో కూడా సీట్లు దొరకడం ఇంత కష్టమా?!...

వాడిపోయిన మొహంతో పరంధామయ్య, తారాబాయ్ వెనక్కి తిరిగారు.

"అర్రెర్రెర్రె... ఆగండి... ఎక్కడికి వెళ్ళిపోతున్నారు?" అని అడిగాడు బోసుబాబు.

"మరి మీరు సీట్లు లేవన్నారుగా?..." ఆశ్చర్యంగా అడిగాడు పరంధామయ్య.

"సీట్లు లేవన్నానుగానీ ఇవ్వనని అన్నానా?... ఎలాగోలా ఎడ్జస్టుచేసి ఇస్తానుగానీ వచ్చిన వాళ్ళని పంపించేస్తానా? హిహి... కూర్చోండి... హి..."

పరంధామయ్య తారాబాయ్ బోసుబాబు ఎదురుగా కూర్చున్నారు.

"చెప్పండి... ఏ పరీక్షకి కోచింగ్ కావాలి?" అడిగాడు బోసుబాబు.

"యమ్.బి.బి.యస్ ఎంట్రెన్స్ పరీక్షకి కోచింగ్ కావాలండీ!..."

"ఓ... అలాగే... అలాగలాగే... హి!"

"ఫీజెంతండీ?..." పరంధామయ్య అడిగాడు..

"నెల రోజులు కోచింగ్ ఇస్తామండీ... ఫీజు మూడువేల రూపాయలు!"

"అమ్మో... మూడువేల రూపాయలే?!..." అన్నాడు పరంధామయ్య.

"ఢాం... ఢాం... ఢాం... ఢాం"

ఆ శబ్దానికి బోసుబాబు కంగారుపడి లేచి నిలబడ్డాడు.

"ఏంటా శబ్దం?!..." అంటూ దిక్కులు చూశాడు. పరంధామయ్య రవ్వంత సిగ్గుపడ్డాడు.

"ఆ శబ్దమా?... నేను గుండెను బాదుకున్నాలెండి..."

"గుండెలా?... ఎందుకూ అంతిదిగా బాదుకోడం? అయినా అది ఛాతీనా లేకపోతే తబలానా - అంత శబ్దం వస్తుందేంటి? ఆ!..."

"మరి మీరు ఫీజు మరీ అంత ఎక్కువ చెప్పారు కదండీ!..."

"ఫీజా?... ఎక్కువా?... భలేవారే!!...అ మాత్రం ఫీజు వసూలు చేయకపోతే మేం అస్తులెలా సంపాదిస్తాం?... అయినా మూడువేల రూపాయలకి

అలా గోలెడ్తారేం?... రేప్పొద్దున్న మీ అమ్మాయి డాక్టరై పరపరా పొట్టలు కోసేసి ఆపరేషన్లు చేస్తూ లక్షలకి లక్షలు సంపాదించదూ?..." అన్నాడు బోసుబాబు.

"సరేనండి... ఆ ప్రకారమే కానివ్వండి..."

"మరి మీ అమ్మాయి ప్రతిరోజు కోచింగ్‌కి ఇక్కడికి వస్తుందా లేక ఇక్కడే ఉండి కోచింగ్ తీస్కుంటుందా?..."

"మాది పక్క ఊరండీ... రోజూ ఇక్కడికి ఆ ఊరునుండి ఎలా వస్తుంది?... ఇక్కడే ఉండి చదువుకుంటుంది..."

"అయితే బోర్డింగ్ లాడ్జింగ్ ఖర్చులు వెయ్యి ఇవ్వాలి!..."

"ఢాం... ఢాం... ఢాం... ఢాం"

"చూడండీ... అదే వద్దండి. అలా గుండెలు బాదుకుంటారేం?... రేప్పొద్దున్న అమ్మాయి లక్షలు సంపాదించదా?" విసుక్కున్నాడు బోసుబాబు.

పరంధామయ్య నీర్సంగా తల ఊగించాడు.

"అయితే అమ్మాయి ఉండడానికి ఒక రూము ఇస్తారు కదండీ?..." అమాయకంగా అడిగాడు పరంధామయ్య.

బోసుబాబు ఆశ్చర్యంగా పరంధామయ్య వంక చూశాడు. "మీ అమ్మాయి ఒక్కర్తికే సెపరేట్ రూమా?!"

పరంధామయ్య తల ఊపాడు అవునన్నట్లు. అంతే... బోసుబాబు తట్టుకోలేక పోయాడు. గుక్కలు పట్టి నవ్వాడు.

"భలేవారే... ఒక్కళ్ళకే అలా సెపరేట్‌గా రూము ఇవ్వం..." అన్నాడు కళ్ళు తుడుచుకుంటూ.

"మరి రూముకి ఎంత మంది ఉంటారండి?"

"ఎంతోనా?... పది పదిహేను మంది ఉంటారు..."

"ఢాం... ఢాం... ఢాం... ఢాం"

"ఏంటలా గుండెలు బాదుకుంటారు?... అలానే ఉండాలి! ఒక్కరు ఇద్దరు ఉంటే హాయిగా నిద్దరోతారు... పదిహేను మంది ఉంటే ఇరుకుగా ఉండి నిద్రపట్టదు... అప్పుడు బాగా చదువుతారు..." అన్నాడు బోసుబాబు.

"నిజమే... నిజమే..." పరంధామయ్య సంబరంగా తల ఊపాడు. "మరి ఎడ్వాన్సు ఎంత ఇవ్వాలండీ?..."

"ఎడ్వాన్సా... భలేవారే... మొత్తం డబ్బంతా జాయినయ్యేప్పుడే ఇవ్వాలి!..." అన్నాడు బోసుబాబు.

"రేపు జాయిన్ చేస్తానులెండి మా అమ్మాయిని" అన్నాడు పరంధామయ్య.

పరంధామయ్య, తారాబాయ్ ఇద్దరూ బోసుబాబు దగ్గర శలవు తీస్కొని ఇంటికి వెళ్ళారు.

తారాబాయ్ తన స్నేహితురాలితో ఆ కోచింగ్ సెంటర్ గురించి చెప్పి "నువ్వుకూడా చేరవే" అంది.

ఆమె స్నేహితురాలు విమల "మా నాన్న అంతంత ఫీజులు ఇచ్చుకోలేరే... నేను ఇంటి దగ్గరే ఎలాగోలా తంటాలు పడ్తాను" అని అంది.

ఆ మర్నాడు తారాబాయ్ "చదువుల్ పరీక్షల్" కోచింగ్ సెంటర్లో చేరింది.

రెండు రోజులకే తారాబాయ్‌కీ మిగతా స్టూడెంట్స్‌కీ అనిపించింది అక్కడ చేరడం చాల దండగని. లెక్చరర్లు ఏమీ చెప్పడంలేదు. వాళ్ళని నిలేసి అడిగితే "బాగుంది మీ వరస?... కాలేజీల్లో కష్టపడి లెక్చర్లు ఇస్తుంటాం... ఇక్కడ కూడా అంత కష్టపడమంటే ఎలా?... మేం అలిసిపోమూ?... ఇంటికెళ్ళాక వంటపనీ బట్టలుతుక్కోవడం అంట్లు తోముకోడం... అన్ని పనులూ ఉండవూ?... ఇక్కడే అలిసిపోతే ఆ పనులన్ని ఎలా చేస్తాం?" అన్నాడు ఒక లెక్చరరు.

"మీరు బ్రహ్మచార్లా?..." అడిగింది తారాబాయ్.

"బాగుంది... బ్రహ్మచార్లయితే ఈ పనులన్నీ అమ్మచేసి పెడ్తుంది, మేమెందుకు చేస్తాం?... పెళ్లైంది కాబట్టే ఈ పనులన్నీ చేయాల్సి వస్తుంది... మీరు పుస్తకాలు తీసి చదవండి... డౌట్సుంటే అడగండి... నేను నిద్దరోతా..." అని టేబుల్ మీద తలవాల్చాడు లెక్చరర్.

ఇలా లాభంలేదని అందరూ కలిసి ప్రిన్సిపాల్ బోసుబాబు దగ్గరికి వెళ్ళి, మాకు సరియైన కోచింగ్ ఇవ్వడంలేదని కంప్లైంట్ ఇచ్చారు.

"మీరు మూడువేల రూపాయలేగా కట్టింది... అంటే మామూలు కోచింగ్ అన్నమాట! మామూలు కోచింగ్ అంటే ఇలానే ఉంటుంది... స్పెషల్ కోచింగ్ చెప్పించుకోండి... దానికైతే ఇంకో వెయ్యి కట్టాలి!..." అన్నాడు బోసుబాబు.

సర్లే అని అందరూ వెయ్యేసి మళ్ళీ కట్టారు. అప్పుడూ కోచింగ్ అంతంత మాత్రంగానే ఉంది. అదేమని అడిగితే... "స్పెషల్ కోచింగ్ కంటే డీలక్స్ కోచింగ్ బావుంటుంది... దానికైతే మరో వెయ్యి కట్టాలి!!..." అన్నాడు బోసుబాబు విలాసంగా.

కానీ విద్యార్థులు ఇహ చేతులెత్తేశారు. హాస్టల్లో వాళ్ళు పెట్టే భోజనం

కుక్కలు కూడా ముట్టవ్... అలాంటి తిండి తిని విద్యార్థుల ఆరోగ్యం కూడా పాడయిపోయింది. ఫలితం... యమ్.బి.బి.యస్ ఎంట్రెన్సు పరీక్షల్లో అందరూ ఫెయిల్ అయ్యారు.

ఇంట్లో చదువుకున్న తారాబాయ్ స్నేహితురాలు విమల మాత్రం పాసయింది.

ఇంతైనా 'మా కోచింగ్ సెంటరు పరీక్షల్లో ఎనభై పర్సెంటు రిజల్ట్సు సాధించింది' అని ప్రకటించాడు "చదువుల్ - పరీక్షల్" ప్రిన్సిపాల్ బోసుబాబు.

(ఒక కోచింగ్ సెంటరు నుండి కొందరు విద్యార్థులు వచ్చి నన్నీ కథని నవ్వితే నవ్ రత్నాలులో రాయమని కోరగా నేను రాశాను -రచయిత)

* * *